క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జేష్ఠ బహుళ దశమిని పురస్కరించుకుని పండితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెన్షనర్ల సంఘ గౌరవాధ్యక్షుడికి సన్మానం


సోమరాజు మాస్టారును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

ఏలేశ్వరం: మండల పెన్షనర్ల సంఘ గౌరవాధ్యక్షుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఉద్దగిరి సోమరాజును పట్టణంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడిగా మెరుగైన సేవలు అందించిన సోమరాజు 96వ సంవత్సరంలోకి అడుగు పెట్టడంతో పట్టణానికి చెందిన ప్రజాప్రతినిధులు, పెన్షనర్స్ సంఘ నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎయిర్ ఫర్‌సేవా సంస్థ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరిటీ, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, బీఏ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట


రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ సుబ్బారావు నుంచి అవార్డులు తీసుకుంటున్న తుని రోటరీ క్లబ్ ప్రతినిధులు

తుని: పేదలకు చేసిన సేవా కార్యక్రమాలకు గాను రోటరీక్లబ్‌కు 23 విభాగాల్లో అవార్డులు వచ్చాయని ఆ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కేఎస్ఎల్ఎస్ వర్మ సోమవారం తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో తుని రోటరీ క్లబ్‌కు ఉత్తమ అధ్యక్షుడు, ఉత్తమ కార్యదర్శి విభాగాల్లో బంగారు, డైమండ్ అవార్డులను రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ రావూరి సుబ్బారావు అందజేశారన్నారు. అవార్డుల రావడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కాగా మంగళవారం స్థానిక సాయి వేదికలో అభినందన సభ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు స్థానిక హెచ్‌సీ సీహెచ్ వీర్రాజు తెలిపారు. మండలంలోని తంటికొండ, గాదెలపాలెం గ్రామాల మధ్య భిక్షాటన చేసుకుంటున్న గుర్తు తెలియని వ్యక్తి జూన్ 10న అపస్మారక స్థితిలో ఉండటాన్ని గాదెలపాలేనికి చెందిన ముత్యం వెంకటేశ్వరరావు గుర్తించి అదేరోజు ఆటోలో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వైద్యం పొందుతున్న సమయంలో అతని పేరు దేవకుమార్ అని డాక్టర్‌కు తెలిపాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 94909 39912, 94409 04830 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

గ్రామాల్లో విద్యార్థుల ర్యాలీ


తిరుమాలిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం బాబూరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలందరూ పాఠశాలల్లో చేరాలన్నారు. బడి-ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్‌బాబు, తూము రౌతు శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, సత్యగౌరి, రాజ్యకళ, పరిమళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో...

ఏలేశ్వరం సాయినగర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టమని పింఛన్


రాచపల్లిలో సాయిబాబా గుడి వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

- పింఛన్ సొమ్ము కోసం ఇబ్బంది పడిన లబ్ధిదారులు
- సచివాలయాల వద్ద పడిగాపులు



ఒమ్మంగిలో పింఛన్ల కోసం సచివాలయానికి చేరుకున్న లబ్ధిదారులు

ప్రత్తిపాడు రూరల్: పింఛన్ల పంపిణీలో జాప్యం కారణంగా మండలంలోని లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. సచివాలయాల వద్దకు నడిచివెళ్లి పింఛన్ల కోసం పడిగాపులు కాశారు. గత ప్రభుత్వం గ్రామ వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేసేది. ప్రతి 50 కుటుంబాలకు ఒక గ్రామ వలంటీర్ ఉండటంతో లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు అందేవి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఆ బాధ్యతను అప్పగించింది. కాగా సచివాలయ ఉద్యోగులు సకాలంలో అందరికీ పింఛన్లు అందించే పరిస్థితి లేకపోవడంతో లబ్ధిదారులు సచివాలయాలకు తరలివచ్చారు. అక్కడ సచివాలయ ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు. సర్వర్ సమస్య తలెత్తడంతో పింఛన్లు పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొంది. గంటల తరబడి లబ్ధిదారులు పింఛన్ల కోసం నిరీక్షించారు. గత ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా సకాలంలో పింఛన్లు అందేవని, మళ్లీ ఆ వ్యవస్థను తీసుకురావాలని పలువురు లబ్ధిదారులు కోరారు.

గ్రామాల్లో జోరుగా పింఛన్ల పంపిణీ


తాళ్లూరులో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


ఏలేశ్వరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


తునిలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

గండేపల్లి/జగ్గంపేట/గోకవరం: ఎన్టీఆర్ భరోసా పథకం పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గండేపల్లి, జగ్గంపేట, గోకవరం మండలాల్లోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు సోమవారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు రూ.4 వేలకు పెంచి లబ్ధిదారులకు అందజేశారన్నారు. పింఛన్ల సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచె రాజ, పార్టీ మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం: పట్టణంలో లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక 18వ వార్డులో వితంతువులు, వికలాంగులకు ఆమె పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల సొమ్మును పెంచినట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, అలమండ చలమయ్య, యండగండి నాగబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని లింగంపర్తి గ్రామంలో చేతిపంపును ఎమ్మెల్యే సత్యప్రభ ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు పాల్గొన్నారు.

సంక్షేమానికి కేరాఫ్ టీడీపీ

తుని: సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది తెలుగుదేశం పార్టీయేనని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తుని పట్టణంలోని తారకరామా నగర్, మేదరిపేటలో ఎన్టీఆర్ భరోసా పథకం లబ్ధిదారులకు సోమవారం ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.4000 పింఛన్‌తో పాటు మూడు నెలలకు చెందిన రూ.3000 కలిపి లబ్ధిదారులకు రూ.7 వేల అందిస్తున్నట్టు తెలిపారు. తుని పట్టణంతో పాటు మూడు మండలాల్లోనూ పింఛన్ పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలో తొలిరోజు సోమవారం 85 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ ఎస్.డేవిడ్‌రాజ్ తెలిపారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



తుని కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


ప్రత్తిపాడులో ధర్నా చేస్తున్న ఐలాజ్, అయర్లా సంఘ నాయకులు

తుని: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టాలను నిరసిస్తూ తుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. సోమవారం తుని కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలుగు కృష్ణశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలు లోపభూయిష్టంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. తక్షణమే కొత్త చట్టాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.గణేష్, ఉపాధ్యక్షుడు యనమల సత్యనారాయణ, కోశాధికారి సాకా సత్తిబాబు, న్యాయవాదులు బీవీవీ రమణ, వెంకటరమణ, చాగంటి రాజు, తాడి శ్రీనివాస్, బాలాజీ, పెండ్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త న్యాయ చట్టాలకు నిరసనగా ధర్నా

ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నేర న్యాయ చట్టాల అమలును నిరసిస్తూ సోమవారం ప్రత్తిపాడులో ఆందోళన చేపట్టారు. ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్), అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (అయర్లా) ఆధ్వర్యంలో స్థానిక అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. నేర న్యాయ చట్టాల అమలును తక్షణమే నిలుపుదల చేయాలని నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐలాజ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ, సభ్యురాలు అవసరాల దేవి, బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు రాజాల చిట్టిబాబు, బండారు నరసింహరావు, కలవలపల్లి సుజన, అయర్లా రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన


జగ్గంపేటలో ర్యాలీ చేస్తున్న అధికారులు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సోమవారం బాల్యవివాహాల నివారణపై కళాజాత ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ముఖ్య అతిథిగా పాల్గొని బాలవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అలాగే ప్రస్తుత సీజనల్‌లో అతిసార, ఇతర వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గ్రామంలో బాల్య వివాహాలు, వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టీవీఎస్ రంగారావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సునిత, ఏఎన్ఎంలు, ఆశాల వర్కర్లు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పాటించండి


మెరక చామవరం ఎంపీపీ పాఠశాలలో తరగతి గదిని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 కొండబాబు


ఏలూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రాజబాబు

రౌతులపూడి: నూతన విద్యా విధానాన్ని అనుసరించి ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలను పాటించాలని ఎంఈఓ-2 గాడి కొండబాబు సూచించారు. మండలంలోని మెరక చామవరం ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఐదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలు, ఉపాధ్యాయుల బోధన వంటి పలు అంశాలపై విద్యార్థులను ఆరా తీశారు. ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, వర్కుబుక్స్‌ను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు , సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీలు

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరులో ఎంపీపీ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పాఠశాలలో రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో ఇంటింటా సర్వే చేసి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ గంగారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం


తునిలో రక్తదానం చేస్తున్న దాతలు

తుని: యువత రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినట్టేనని రోటరీక్లబ్ ఆఫ్ తుని సెంట్రల్ అధ్యక్షుడు చక్కా శ్రీధర్ అన్నారు. స్థానిక బాడవతోట వీధిలోని శుభం ఫంక్షన్ హాలులో సోమవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు పిలుపు మేరకు ఏర్పాటు చేసిన శిబిరంలో వివేకా కళాశాల, లయోలా విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, పలువురు పట్టణ ప్రముఖులు కలిసి 70 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. రక్తదానం చేసిన దాతలు, ఫంక్షన్ హాలు అధినేత దాడిశెట్టి విష్ణుచక్రానికి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తుని సెంట్రల్ కార్యదర్శి దండెం కృష్ణ, క్యాంపు చైర్మన్ కామేశ్, తుని ఎస్సై, దండెం రామకృష్ణ, కంకిపాటి జమీల్, మదర్ బ్లడ్ బాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

శంఖవరం: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని పెద్దాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని కత్తిపూడిలో ఉపాధ్యాయులకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో ఆచరించాలన్నారు. శిక్షణ పూర్తయ్యాక రెండు పరీక్షలు ఉంటాయని, వాటిలో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలన్నారు. లేకుంటే అమరావతిలో మళ్లీ శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్వీ రమణ, 12 మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, రీసోర్స్ పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ బంగారు కిరీటానికి అడ్వాన్స్


స్వర్ణకారుడికి అడ్వాన్స్ చెల్లిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మకు బంగారు కిరీటం చేయించడానికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సోమవారం స్వర్ణకారుడికి అడ్వాన్స్ సొమ్ములు చెల్లించారు. అమ్మవారి విగ్రహానికి బంగారం, వజ్రాలు పొదిగిన కిరీటం చేయించడానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు సంకల్పించారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో కిరీటం చేయించడానికి నిర్ణయించగా భక్తులు సుమారు రూ.7 లక్షల వరకు నగదు, బంగారం అందించారు. మిగిలిన మొత్తాన్ని కంబాల శ్రీనివాసరావు సమకూర్చి కిరీటం చేయించేందుకు సోమవారం ఆలయంలో అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో రాజమహేంద్రవరానికి చెందిన స్వర్ణకారుడికి అడ్వాన్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు, ఆలయ అర్చకుడు వల్లూరి జగన్నాథశర్మ మాట్లాడుతూ సుమారు 250 గ్రాముల బంగారంతో కిరీటం చేయించడానికి నిర్ణయించామన్నారు. శ్రావణమాసం నాటికి కిరీటం సిద్ధమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాసరి తమ్మన్నదొర తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

శంఖవరం: గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోందని, అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని జనసేన నేతలు కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఆర్అండ్‌బీ రహదారిపై నిత్య మురుగునీరు ప్రవహిస్తోందన్నారు. దీంతో ఈ రహదారిపై ప్రయాణించేందుకు స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మేకల కృష్ణ, కర్రి రమేష్, సకిరెడ్డి బాబి, కర్రి వినోద్, ప్రగడ ప్రసాద్, మేకల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

తొండంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ మణేశ్వరరావు సోమవారం తెలిపారు. ఎంపీపీ దడాల సువర్ణలత అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలోని అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం


డాక్టర్ శివరాజు ప్రసాద్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు


ప్రత్తిపాడు సీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్లు

తుని: ప్రజల ప్రాణాలను కాపాడే అవకాశం వైద్యులకే దక్కిందని వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ జిల్లా గవర్నర్ చదరం శివాజీ అన్నారు. సోమవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా హైమా నేత్రాలయ కంటి వైద్యుడు శివరాజు ప్రసాద్‌ను తుని వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. సమాజంలో వైద్యుల పాత్ర కీలకమని గవర్నర్ శివాజీ అన్నారు. వాకర్స్‌కు ఉచిత వైద్య సేవలు అందించాలని డాక్టర్ శివరాజు ప్రసాద్‌ను కోరారు. వాకర్స్ హెల్త్‌క్లబ్ జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, తుని శాఖ అధ్యక్షుడు డిఎస్ఎస్.మూర్తి, కార్యదర్శి చోడిశెట్టి బాబూరావు, కండవల్లి జోసెఫ్, యోగా గురువు ప్రసాద్ పాల్గొన్నారు.

గండేపల్లి/జగ్గంపేట: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. జగ్గంపేటలో డాక్టర్ రమేష్‌ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పూలమాల, శాలువాతో సత్కరించారు. జగ్గంపేటలో విశ్రాంత ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో వైద్యులు గోలి శ్రీరాములు, ఎంఎస్ బాలగంగాధర్, బీవీవీ ప్రసాద్, బి.రమేష్, ప్రభుత్వ వైద్యులు టి.ప్రణీత్, కె.భాగ్యలక్ష్మి తదితరులను ఘనంగా సన్మానించారు.

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కరోనా మహమ్మారి సమయంలో దేశంలో అశువులు బాసిన వైద్యులకు సీహెచ్‌సీ వైద్య సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ వైద్యులు రోగుల పట్ల ప్రేమ, కరుణ, దయ చూపాలన్నారు. ఇటీవల కాలంలో వైద్యుల, ఆసుపత్రులపై దాడులు జరగడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యబృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డయేరియా రహిత గ్రామాలే లక్ష్యం


కొత్తపల్లిలో డయేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్ఈఓ మూర్తి


కిర్లంపూడిలో చిన్నారులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

ప్రత్తిపాడు: పల్లెలను డయేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. మండలంలోని పెదశంకర్లపూడిలో డయేరియాను ఆపండి (స్టాప్ డయేరియా) కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యారోగ్య శాఖ ముద్రించిన వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం పలువురికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూర్నీడి సురేష్, వరుపుల రామకృష్ణ, దోౕ నవీన్, జువ్విన తిరుపతిరావు, హిందూ ధర్మ రక్షా సమితి నాయకుడు కర్రి ధర్మరాజు, పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కొండేపూడి యశస్వీ, హెల్త్ సూపర్‌వైజర్లు నాగవాసు, రామిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తుని రూరల్: సీజనల్‌గా వ్యాపించే అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే యనమల దివ్య సూచించారు. మండలంలోని తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. అంటువ్యాధుల నివారణ చర్యల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ తాగునీరు, వేడి పదార్థాలు, అత్యవసర చికిత్సలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. 24 గంటలు అందుబాటులో ఉండి అత్యవసర వైద్య సేవలు అందించాలన్నారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు కృషి చేయాలి

గోకవరం: ప్రజలు డయేరియా బారిన పడకుండా వైద్య సిబ్బంది అవగాహన కల్పించి దాని నిర్మూలనకు కృషి చేయాలని గోకవరం, కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రుల ఎంపీహెచ్ఈఓలు శంకర్, డీఎస్ మూర్తి వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని గోకవరం, కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియా కేసులు నమోదు, చికిత్స, మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజలకు ఓఆర్ఎస్ ద్రావణం తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు, హెచ్‌వీ రాజేశ్వరి, వైద్య సిబ్బంది అనూష, అరుణ, మౌనిక, పవన్, రమణ, ఏఎన్ఎంలు మున్ని, నాగలక్ష్మి, సూర్యకాంతం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

కిర్లంపూడి: డయేరియాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ తోట రవి సూచించారు. మండలంలోని రమణయ్యపేట, కిర్లంపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన డయేరియా కంట్రోల్ శిబిరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత ఆధ్వర్యంలో పలువురు పిల్లలకు రోగనిరోధిక మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తోట రవి మాట్లాడుతూ సోమవారం నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తారన్నారు. పిల్లలకు అతిసార వ్యాధి రాకుండా ఓఆర్ఎస్, జింక్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. సీజనల్ వ్యాధుల రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తొలుత డాక్టర్స్ డే సందర్భంగా స్థానిక వైద్యుడు బి.రాంబాబునాయక్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, పార్టీ మండల అధ్యక్షుడు చదరం చంటిబాబు, తూము కుమార్, గుడాల రాంబాబు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.